క్లుప్తంగా

గుత్తి కోట క్యాలెండర్ల ఆవిష్కరణ



గుత్తి కోట క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రసిద్ధిగాంచిన గుత్తి కోటకు సంబంధించిన క్యాలెండర్లను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గుత్తి కోట అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుత్తికోట సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు ఎన్నికల నామినేషన్ల పరిశీలన



నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

ఉరవకొండ: పట్టణంలోని పాత గాంధీచౌక్ వద్ద ఉన్న టౌన్ బ్యాంకు కార్యాలయంలో ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల షెడ్యూల్ భాగంగా ఆదివారం నామినేషన్ల పరిశీలన నిర్వహించారు. కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి బాలగంగాధర్, పీఐసీ రవి, బ్యాంకు సీఈఓ కరణం వేదమూర్తి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నామినేషన్ల పరిశీలన కొనసాగింది. ఈడిగ విశ్వనాథ్ నామినేషన్ మాత్రమే తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మిగతా 20 నామినేషన్ల సక్రమంగా ఉన్నాయన్నారు. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా సోమవారం నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

మాలధారణ దీక్ష జయప్రదం చేయండి

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠ సంస్థానం మొదటి పీఠాధిపతి జగద్గురు కరిబసవరాజేంద్రస్వామి మాలధారణ దీక్ష కార్యక్రమాన్ని భక్తులు జయప్రదం చేయాలని గవిమఠం ఏజెంట్ రాజన్నగౌడ్ కోరారు. ఆదివారం గవిమఠం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వేలాది మంది భక్తులు కలిగి ఉన్న గవిమఠం వ్యవస్థాపకుడు, మొదటి పీఠాధిపతి కరిబసవ రాజేంద్రస్వామి మాలధారణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైందన్నారు. పీఠాధిపతి విగ్రహనికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈఏడాది మార్చి 1న గవిమఠం రథోత్సవం నాటికి మండల దీక్ష ముగిస్తామన్నారు. దీక్ష చేపట్టాలని భావిస్తున్న భక్తులు మండల, అర్ధ మండల దీక్ష స్వీకరించవచ్చని ఆయన సూచించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

కుందుర్పి: మండల కేంద్రంలో సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 23వ తేదీ బలిహరణం, ఉత్సవం, హోమం, 24న బండమీదపల్లి గ్రామస్తులచే సమారాధన, రాత్రికి స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 25న బ్రాహ్మణ సంఘం వారిచే సమారాధన, సాయంత్రం బలిహరణ, 26న ఉదయం హోమం, మధ్యాహ్నం 12:25 గంటలకు బ్రహ్మరథోత్సవం, రాత్రికి ధూళోత్సవం సందర్భంగా రథాన్ని ఊరేగిస్తారు. 27న పానకం బండ్ల ఊరేగింపు, 28న ధ్వజారోహణంతో బ్రహ్మత్సవాలు ముగియనున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం



రహదారిపైకి వాలిన కాలిపోయిన చెట్టు కొమ్మలు

కూడేరు: మండలంలోని కమ్మూరు వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన కాలిపోయిన చింత చెట్టు కొమ్మలతో వాహనాదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఏడాది క్రితం కొందరు ఆకతాయిలు ఆ చెట్టుకు నిప్పు పెట్టడంతో కాలి ఎండిపోయింది. కొమ్మలు రహదారి వరకూ ఉన్నాయి. అవి ఏ క్షణాన్నైనా విరిగిపడవచ్చు. వాహనాలపై పడితే వాహనాదారులు గాయపడే అవకాశముంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

పథకాలతో ప్రతి ఇంటా సిరుల పంట

- గడప గడపలో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



కుందుర్పి: శ్రీమజ్జనపల్లిలో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



గుమ్మఘట్ట: 75 వీరాపురం గ్రామంలో బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కుందుర్పి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటా సిరుల పంట పండిందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీమజ్జనపల్లిలో సర్పంచ్ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డితో కలసి మంత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆమె మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి అర్హులందరికీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందజేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సీఎం విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్ష నాయకులు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్నను మరోసారి సీఎం చేసుకునేందుకు మనమందరం సమన్వయంతో పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, కుంచిటి వక్కళిగ రాష్ట్ర డైరెక్టర్ సుజాతమ్మ, ఎంపీపీ కమలమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఈరన్న, కెంచమ్మ, వార్డు మెంబర్లు భాగమ్మ, ప్రభాకర్, నాయకులు ముద్దుల పాలయ్య, నన్నీరప్ప, రుద్రప్పగారి పాలయ్య, సత్యానంద, శివన్న, గొర్లప్పగారి బోరయ్య, కెంబోబయ్య, జంగమ పాలయ్య, అంగడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

గుమ్మఘట్ట: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందినంతగా ఇంతవరకూ లబ్ధి పొందలేదని పలువురు మహిళలు విప్ దృష్టికి తీసుకువచ్చారు. మరో పది కాలాల పాటు సీఎంగా జగనన్నే ఉంటారన్నారు. విప్ మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటికీ పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని సూచించారు. కల్లిబొల్లి మాటలు చెప్పి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేట్లు ఫిక్స్ చేసి అడ్డదారుల్లో జలగల్లా పీడించిన టీడీపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను నిలిపి వేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ భవాని, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, మండల కన్వీనర్ మంజునాథ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, మాజీ కన్వీనర్లు గౌని కాంతారెడ్డి, అశ్వర్థరెడ్డి, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, మాజీ సర్పంచ్ రంగప్ప, నాయకులు రవి, ఎర్రిస్వామి, రుద్రరెడ్డి, గోవిందరెడ్డి, ఈశ్వరరెడ్డి.

ప్రభుత్వ పథకాలు అందాయి



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందాయి. అమ్మ ఒడి, వైఎస్సార్ రైతుభరోసా, ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్, సున్నావడ్డీ కింద గత మూడున్నర సంవత్సరాల కాలంలో రూ.4,41,707 లబ్ధి చేకూరింది. పథకాల కోసం ఎవరికీ లంచం ఇవ్వలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగలేదు. వలంటీర్లే ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు మంజూరు చేశారు.

– గొల్ల నాగమ్మ, 75 వీరాపురం, గుమ్మఘట్ట

పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాలు



వైద్య శిబిరంలో కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని పేద ప్రజలు కంటి, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడకుండా ఉండాలనే లక్ష్యంతో ఉచితంగా కంటి, గుండె చికిత్స వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. అధికారంలో ఉన్నా..లేకపోయినా ఊపిరి ఉన్నంత కాలం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఆదివారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్, రూరల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూల్ శాంతిరామ్ మెడికల్ కళాశాల సహకారంతో ఉచిత కంటి, గుండె శస్త్ర చికిత్సల వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. శాంతిరాజ్ మెడికల్ టీమ్ వైద్యుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో 261 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 121 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. అలాగే 41 మందికి గుండె పరీక్షలు నిర్వహించి 12 మందిని ఆపరేషను అవసరమని గుర్తించారు. విప్ మాట్లాడుతూ ఆపరేషన్లకు వెళ్లే రోగులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన అందరికీ భోజనవసతి కల్పించారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు కలుగోడు మహేష్, కౌన్సిలర్ శ్రీలక్ష్మి, నాయకులు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, సునార్ ఇస్మాయిల్, ఓబ, బుజ్జి, వలంటీర్లు అబుబక్కర్, సునీల్ పాల్గొన్నారు.

‘ఉన్నం’ అక్రమాలను ప్రజలు మర్చిపోలేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి కుటుంబం చేసిన అరాచాకాలు, అక్రమాలు, దౌర్జన్యాలను ప్రజలు మరచిపోలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. మండలంలోని గోళ్ల గ్రామంలో ఆదివారం మండల కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రజాక్, గ్రామ సచివాలయ కన్వీనర్లు సర్వోత్తం, గోపాల్, పోతేస్, సీనియర్ నాయకులు రామలింగప్ప, మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, సూరప్ప,శీన విలేకరులతో మాట్లాడారు. కళ్యాణదుర్గంలో టీడీపీ నాయకులు ఉన్నం, ఉమా వర్గీయులు ఉనికి కోసం మంత్రి ఉషశ్రీచరణ్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రిపై చేస్తున్న ఆరోపణలలో ఒక్కటి కూడా నిరూపితం చేయకుండా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ హయాంలో పట్టణంలో చర్చిని కూల్చేసి కాంప్లెక్స్ నిర్మించుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అవినీతిలో ఆరితేరిన టీడీపీ నాయకులకు మంత్రిని విమర్శించే అర్హతలేదన్నారు. టీడీపీ నాయకులే కాదు ఆ పార్టీకి 2024 ఎన్నికల్లో నామరూపాలుండవని ఎద్దేవా చేశారు. పసలేని విమర్శలు మానుకొని ప్రజలకు మేలుచేసే పనులు చేయాలని హితవు పలికారు.

కుంభమేళా వాల్ పోస్టర్ల విడుదల



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న బంజారా సంఘం జాతీయ నాయకుడు కేశవనాయక్ తదితరులు

వజ్రకరూరు: మహారాష్ట్రలోని బెలగావ్ జిల్లా జామ్‌నేర్ తాలుకా గోద్రితండాలో ఈనెల 25 నుంచి నిర్వహించే అఖిల భారత బంజారా కుంభమేళా వాల్ పోస్టర్లను బంజారా సంఘ నేతలు విడుదల చేశారు. మండలంలోని రూపానాయక్‌తండాలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బంజారా సంఘం జాతీయ నాయకుడు ఎస్‌కే కేశవనాయక్ , నంగరేర్ నాయక్ మాట్లాడారు. మహారాష్ట్రలోని బెలగావ్ జిల్లా గొద్రితండాలో ఐదు రోజులపాటు జరిగే అఖిల భారతీయ గోర్ బంజారాల కుంభమేళా కార్యక్రమానికి రూపానాయక్‌తండావాసులకు ప్రత్యేక ఆహ్వానం వచ్చిందన్నారు. బంజారాల సంస్కృతి, ఢాల్ తల్వార్ విన్యాసం, నగారా మోగించే పద్ధతులను అక్కడ ప్రదర్శించనున్నారని తండా పెద్దలు దాసునాయక్, నాణ్యానాయక్, కొర్రాదేశానాయక్, పాల్యవాల్యానాయక్, వడిత్య నర్సింగ్‌నాయక్ తెలిపారు. 25వ తేదీ ప్రత్యేక బస్సులో బయలుదేరి 26, 27 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే కుంభ మేళాలో పాల్గొంటామని వారు తెలిపారు.


పూర్వ విద్యార్థుల కలయిక



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కంబదూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలిశారు. 27 సంవత్సరాల తర్వాత వారందరూ ఒక చోట కలవడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. నాటి అల్లర్లను గుర్తుచేసుకుని మురిసిపోయారు. అలాగే అప్పటి ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, రామాంజనేయులు, నీలి హనుమంతరాయుడు, రాజశేఖర్, శివారెడ్డి, అనిల్ తదితరులను సన్మానించారు.

రేపటి నుంచి శివలింగాల ప్రతిష్టాపన



ముస్తాబైన ఆలయం

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో రామలింగేశ్వర ఆలయంలో ఈనెల 24 నుంచి 108 శివలింగాల ప్రతిష్ట, కలశ స్థాపన కార్యక్రమం ప్రారంభించనునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సంస్థాన కల్‌హోళ మఠం, పాల్తూరు, మ్యాళిగనూరుకు చెందిన చన్నవీర శివాచార్య స్వాములు, బళ్లారికి చెందిన పంపాపతి శాస్త్రి, ఆలూరు తాలుకా, కొక్కరచేడు గ్రామానికి చెందిన శివశరణమ్మ, పండీపురానికి చెందిన చైతన్య సద్గురు గోపాల్ మహారాజులు, బళ్లారికి చెందిన మహంతేశమూర్తి ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందన్నారు. మంగళవారం, బుధవారాలు హోమాలు, నవగ్రహ పూజలు నిర్వహించి గురువారం ఉదయం 108 శివలింగాల ప్రతిష్టాపన, నందీశ్వర ప్రతిష్టాపన, కలశ ప్రతిష్టాపన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సంత ద్వారా రూ.1.78 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,78,250 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ, విక్రయాలు జరుగుతున్నట్లు వారు తెలిపారు. రైతులు గమనించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



చెర్లోపల్లిలోని మామిడి తోటను పరిశీలిస్తున్న ఏఎఫ్ ఎకాలజీ అధికారులు

శెట్టూరు: పండ్ల తోటల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించడం వల్ల అధిక దిగుబడి అందిచవచ్చని ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది సూచించారు. ఆదివారం చెర్లోపల్లిలోని మామిడి తోటల్లో వారు పర్యటించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొక్కల ఎంపిక, మొక్కలు నాటే పద్ధతి, నీరు అందించడం, చీడపీడల నివారణపై రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎకాలజి క్లస్టర్ కోఆర్డినేటర్ శివమ్మ, సీసీఓ రంగనాయకులు, ఎస్టీ కళ్లాయప్ప, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహనా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విప్, జెడ్పీ చైర్‌పర్సన్, డిప్యూటీ కమిషనర్

రాయదుర్గం: పట్టణంలో ఆదివారం వాహన భద్రతపై చేపట్టిన ర్యాలీని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం డిప్యూటీ కమిషనర్ శివరామ్‌ప్రసాద్, స్థానిక ఎంవీఐ విశ్వనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్, జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు.. మానవ తప్పిదాల వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అప్రమత్తంగా డ్రైవింగ్ చేస్తే తమ వాహనంతో పాటు ఎదుటి వాహనదారులు కూడా క్షేమంగా ఉంటారన్నారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని గుర్తుచేశారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజీనాయక్, జెడ్పీటీసీ మహేష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

కంబదూరు: మండల కేంద్రంలోని సచివాలయం –2 పరిధిలోని గుండ్లపల్లి, ఆర్డీటీ కాలనీ, పాత ఎస్సీ కాలనీ, కొత్త ఎస్సీ కాలనీల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజుయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఒకటో సచివాలయ పరిధిలో సోమవారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ హాజరు కావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: పట్టణంలోని పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీవారి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, వరపూజ, వస్త్ర సమర్పణం, మహా సంకల్పం, కన్యాదానం, మాంగల్య పూజ, అక్షతరోపనం, మహా మంగళహారతి పూజలు చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం వినియోగం చేపట్టారు.

ఆర్డీటీ ప్రోత్సాహం.. యువతకు వరం

- నత్ఫలితాలనిస్తున్న భాషా ప్రావీణ్య శిక్షణ
- నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు



ఆంగ్ల బోధన చేస్తున్న ఫ్రాన్స్ శిక్షకురాలు రఫెల్లా

కూడేరు: ఆర్డీటీ ప్రోత్సాహం నిరుపేద యువతకు వరంలా మారింది. నిరుపేద యువతీ యువకులు, దివ్యాంగులకు భాషా ప్రావీణ్యం , అకౌంట్స్, సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చేందుకు ఆర్డీటీ శ్రీకారం చుట్టింది. ఆరు నెలల పాటు ఉచితంగా శిక్షణ, వసతి సదుపాయం కల్పిస్తోంది. బెంగళూరు, హైదరాబాదు వంటి నగరాల్లోని ప్రైవేటు కంపెనీలు, ఆర్డీటీలోనూ ఉద్యోగ అవకాశాలు దక్కేలా చేస్తోంది.

2018లో శిక్షణ కేంద్రం ఏర్పాటు

కూడేరులోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఆ సంస్థ 2018లో ఉచిత శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన నిరుపేద కుటుంబాలకు చెందిన 20 మంది యువతీ యువకులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసుకుని ఆరు నెలలపాటు ఆంగ్లం, జర్మన్ భాష, కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ అందజేస్తోంది. వారికి ఉచితంగా భోజనంతో పాటు వసతులు కల్పిస్తోంది. 2019–20లో వసతితో కూడిన శిక్షణ, 2020–21,2021–22 కరోనా నేపథ్యంలో ఆన్‌లైన్ క్లాసుల ద్వారా శిక్షణ, 2022–23కు సంబంధించి శిక్షణ కొనసాగుతోంది. ఆర్డీటీ ఆధ్వర్యంలో ఇలాంటి కేంద్రాలు బుక్కరాయసముద్రం, అనంతపురం రూరల్ , బత్తలపల్లిలో కూడా నిర్వహిస్తున్నారు. శిక్షణక ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు జిల్లా యువతకు అవకాశం ఇస్తున్నారు,

స్వచ్ఛందంగా ఇంగ్లిష్, జర్మన్ భాష బోధన

నిరుపేద యువతీయువకులకు ఎలాంటి పారితోషకం తీసుకోకుండా ఫారిన్‌కు చెందిన అనుభవజ్ఞులు ఆంగ్లం, జర్మన్, అకౌంట్స్,సాఫ్ట్ స్కిల్స్‌పై బోధన చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రఫెల్లా ఆంగ్లంపై, ఇసాబెల్ సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్స్‌పై, రితీష్ అకౌంట్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. రఫెల్లా మాట్లాడుతూ పేద యువతీ యువకులు ఉద్యోగాల్లో స్థిరపడాలన్నదే లక్ష్యమన్నారు. ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యం ఉంటే ఎక్కడైనా రాణించవచ్చన్నారు. అలాగే ఇంటర్వ్యూలకు ఎలా సిద్ధం కావాలో శిక్షణ ఇస్తామన్నారు.

గూగుల్ కంపెనీలో ఉద్యోగం



మాది పేద కుటుంబం. 2018 బ్యాచ్‌లో ఆర్డీటీ ద్వారా ఆంగ్లం, కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ పొందా. ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా హైదరాబాదులో గూగుల్ కంపెనీలో ఉద్యోగం సంపాదించుకున్నా. ఆర్డీటీ శిక్షణ ఇవ్వకుంటే ఉద్యోగాన్ని పొందేవాడిని కాదు.

– చంద్రమోహన్, సోములదొడ్డి, అనంతపురం రూరల్ మండలం

ఆర్డీటీ మేలును మరువను



2018లో ఆర్డీటీ ఇచ్చిన ప్రకటన నా జీవితానికి టర్నింగ్ పాయింట్ అయింది. శిక్షణలో ఆంగ్ల భాష ప్రావీణ్యాన్ని పెంపొందించుకున్నా. బెంగళూరులో కోపెన్ క్రెడిట్ మేనేజ్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించా. నెలకు రూ.40 వేలు జీతం వస్తుంది. ఆర్డీటీ మేలును మరువను.

– శ్రావణ్ కుమార్, రాచినే పల్లి, తనకల్లు మండలం

ఆరు నెలల పాటు శిక్షణ



ఆరు నెలల పాటు శిక్షణ సాగుతుంది. శిక్షణ కాలమంతా వారికి ఎలాంటి లోటు లేకుండా గదులు, భోజన వసతి కల్పిస్తున్నాం. శిక్షణలో సందేహాలు నివృత్తి చేయిస్తున్నాం. నాలుగేళ్లలో 80 మందికి శిక్షణ ఇచ్చాం. సుమారు 50 మంది వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదించుకున్నారు.

– ఓబుళపతి, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్